
ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం



ఉపాధ్యాయుడు, వాచ్‌మేన్‌పై పోక్సో కేసు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు, వాచ్‌మేన్‌పై పోక్సో కేస్ నమోదు చేసినట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. విద్యార్థినిల పట్ల వీరు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాఠశాలలలో విద్యార్థినులను విచారించామన్నారు. వీరి అభిప్రాయం తీసుకొని ఉపాధ్యాయుడు, వాచ్‌మేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒత్తిడి వద్దు.. సాధించాలన్న తపన ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉత్తీర్ణత సాధించాలన్న తపన, పట్టుదలతో చదవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ డివిఎంఎం ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అందరితో కరచాలనం చేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను, సాధించేందుకు ఏర్పరుచుకున్న ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు భవితకు పదోతరగతి, ఇంటర్ మీడియట్ కీలక మలుపునిస్తుందని విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపారు. ముందున్న లక్ష్యాల సాధనకు ఏకాగ్రతతో చదువే ధ్యాసగా శ్రమించాలని సూచించారు. అనుకున్నది సాధించి ఆనంద క్షణాలను ఆశ్వాదించడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందన్నారు. విద్యార్థులు ఆత్మనూన్యతను వీడి వెనుకబడిన పాఠ్యాంశాల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పాఠశాల దత్తత అధికారిగా విద్యా అభ్యాసన, ప్రగతిపై ఆయా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడినట్లు వెల్లడించారు. కష్టపడే స్వభావానికి సరైన వ్యూహాలు తోడైతేనే సానుకూల ఫలితాలు వస్తాయని గ్రహించాలని, ఆ దిశగా మీ మేధస్సుకు పదును పెట్టాలని హితవు పలికారు.



టెన్త్ విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వ్యక్తిగతంగా ప్రోత్సాహకాలను అందిస్తానని వారిలో ప్రేరణ అందించారు.

విజ్ఞాన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

స్థానిక చర్చి వీధిలో గల వార్డు విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విజ్ఞాన కేంద్రంలో గ్రూప్ 2, ఇతర పోటీ పరీక్షలకు సాధన చేస్తున్న యువతీ, యువకులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యా ప్రమాణాలు ఉన్నతీకరించుకోవడానికి నిరంతర శ్రమ అలవర్చుకోవాలని అన్నారు. భవిష్యత్ కలలు, ఉన్నత లక్ష్యాలను ఛేదించేందుకు అవసరమైన జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా వివిధ ఉద్యోగ ప్రకనలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలోడిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఎంఇఒ వై.విమల కుమారి, పాఠశాల హెచ్ఎం గోవిందరావు, తదితరులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

శాసన మండలిలో మీ గొంతునవుతా... ఉపాధ్యాయులను కోరిన పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-పూసపాటిరేగ, రాజాం

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గొంతు వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యరి పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ, రాజాం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం, జి.సిగడాం మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. 33ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన ఆరేళ్ల సర్వీసును వదిలేసి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, ఒక్క అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపిస్తానని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా ఉపాధ్యాయ పోస్టులు, పాఠశాలలు తగ్గిపోయాయని తెలిపారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ విద్యారంగంపై ప్రభుత్వ తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాట ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని అన్నారు. ఈ సందర్భంగా 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నంబరు 3ను పునరుద్ధరించడానికి శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల గొప్పతనాన్ని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పని చేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. పెద్దల సభను రాజకీయ సభగా మార్చొద్దు అని, పెద్దల సభకు పోరాటపటిమ కలిగి, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి ని పంపాలని కోరారు. ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజాంలోని పాఠశాలలో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

నవ వధువు పరారీ

- నిలిచిన కులాంతర వివాహం
- మక్కువలో సంచలనం

ప్రజాశక్తి - మక్కువ

మరికొద్ది గంటల వ్యవధిలోనే బాజా భజంత్రీల మధ్య వివాహం కావాల్సిన తరుణంలో నవవధువు పరారీ కావడంతో పెళ్లి నిలిచిపోయిన సంఘటన మక్కువలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మక్కువ గ్రామానికి చెందిన బి.రవితో చెముడు గ్రామానికి చెందిన జె.ఉషారాణికి వివాహం నిశ్చయమైంది. వీరు వేర్వేరు కులాలకు చెందిన వారు. ఇద్దరూ ప్రేమించుకొని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. దీంతో పెద్దల అంగీకారం కుదరడంతో శనివారం వివాహానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం చెముడులో ఉన్న వధువు ఉషారాణిని పిలుపు కోసం వరుడు కుటుంబీకులు వెళ్లారు. దీంతో కన్నవారి ఇంట్లో ఆమె లేకపోవడంతో అంతా నిర్ఘాంత పోయారు. తండ్రి సమాధి వద్దకు వెళ్లి నివాళ్లు అర్పించి వస్తానని చెప్పిన ఉషారాణి తిరిగి రాకపోవడంతో బంధువుల్లో కలవరం మొదలైంది. దీంతో వెతక సాగారు. అట్టహాసంగా పెళ్లి చేద్దామనుకున్న పెళ్లి మండపంలో అంతా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పెళ్లికి వచ్చిన బంధువులంతా అప్పటికే వంటలు ప్రారంభం కావడంతో భోజనాలు చేసి వధువు లేక పెండ్లి నిలిచిపోవడంతో తిరిగి ప్రయాణమయ్యారు. ఇదిలా ఉండగా మక్కువ పోలీసులకు రవి కుటుంబీకులు పెండ్లి కుమార్తె కనిపించలేదని ఫిర్యాదు చేశారు. అలాగే తనకు ఇష్టం లేకనే పెళ్లికి రాకుండా పరారయ్యారని వధువు కూడా పోలీసులకు సమాచారం ఇచ్చారని రైటర్ శ్రీనివాసరావు తెలిపారు. ఏ విధమైన కేసు నమోదు కాలేదని ఆయన తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వారంలోగా మౌలిక వసతుల కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం తన సమావేశ మందిరంలో అంగన్వాడీల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రానికి వెంటిలేషన్స్, లైట్లు, రన్నింగ్ వాటర్, ట్యాపులు, టాయిలెట్స్ ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ ఉండాలని, హేండ్ వాష్ తప్పనిసరని తేల్చిచెప్పారు. రంగులు వేయాలని, వాటర్ ట్యాంకు తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తెలిపారు. పూర్తయిన పనులకు సంబంధిత బిల్లులను గ్రామీణ నీటిసరఫరాల విభాగానికి అందజేస్తే చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని, దీనిపై సూపర్ వైజర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలిపారు. ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ జిల్లాలో బాగుందని కితాబిస్తూ, ఈ రైస్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అన్నారు. బాల్య వివాహాలు జిల్లాలో జరగడానికి వీల్లేదన్నారు. డ్రాప్ అవుట్స్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు అందించే ఇంటికే రేషన్‌ను సకాలంలో అందజేయాలని అన్నారు. బాలల ఆధార్ నమోదులో జిల్లా ముందంజలో ఉండాలని అన్నారు. ఐరిష్ లేకపోయినా బాల ఆధార్ నమోదు చేసుకోవచ్చని, కావున దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాల్లో వెనుకంజలో ఉన్న ఐదుగురు సిడిపిఒలకు ఛార్జ్ మెమోలు జారీచేస్తామని, కావున అందరూ శ్రద్ధగా పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి. కనకదుర్గ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, సిడిపిఒలు,సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా మట్టితవ్వకాలు చేపడుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అక్రమ మైనింగ్ తవ్వకాలను ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలో అల్లువాడ, తుంబలి గ్రామ సమీపంలో అక్రమంగా తవ్వుతున్న కంకర మైనింగ్ ప్రాంతాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలంలో కాంట్రాక్టర్లు అక్రమంగా మైనింగ్ చేసి కంకరు తవ్వుకొని వెళ్లిపోతున్నా మైనింగ్ అదికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కుమ్మరి కులస్తులు కుండలు చేసుకోవడానికి మట్టి తవ్వితే కేసులు పెట్టే అదికారులు మెయిన్ రోడ్‌కు పక్కనే అక్రమంగా కంకరు తవ్వుకు వెళ్లిపోతే మైనింగ్ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు, లేక పోతే అధికార పార్టీ నేతలకు భయపడి పట్టించు కోవడం లేదా అని ప్రశ్నించారు. జియ్యమ్మవలస మండలంలో అక్రమ మైనింగ్ చేస్తే చూసీచూడనట్లు పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా మైనింగ్ అదికారులు జియ్యమ్మవలస మండలంలో జరుగుతున్న అక్రమంగా తవ్వుతున్న కంకర క్వారీలు ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని ఆన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె సీతారాం పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 25 సీతంపేట వైటీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లిమిషన్ ఆపరేటర్, అసెంబల్ ట్రైనీస్‌లి ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన, 18 నుంచి 32 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో 2 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 2 కంపెనీల్లో 300 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15వేలు నుంచి రూ.18,000 వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఉద్యోగ సమయంలో ఉచిత భోజనం, రవాణా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 8886660974, 8886660979, 7032060773 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతర ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ చీపురువలస గ్రామం వద్ద ఉన్న పారమ్మ కొండపై బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న జాతర ఏర్పాట్లను శనివారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆలయ కమిటీ సభ్యులకు సూచనలు ఇచ్చారు. భక్తుల రద్దీ, ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, వైద్య శిబిరాలు, పోలీస్ భద్రత వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ లేకుండా మెరుగైన ఏర్పాట్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు మంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, చల్లా కనక, పిన్నింటి ఈశ్వరరావు, కొత్తల పోలినాయుడు తదితర పాల్గొన్నారు.



పారమ్మకొండపై పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

శివరాత్రికి సిద్ధమవుతున్న గుంప సోమేశ్వర స్వామి ఆలయం

కొమరాడ : మహాశివరాత్రి సందర్భంగా నాగావళి, జంఝావతి నదుల సంగమాల్లో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయాన్ని శివరాత్రికి ఆలయ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా టెంట్లు, బారికేడ్లను ఆలయ ఇఒ మండల ప్రసాదరవు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు, వెనుక భాగాల్లో భక్తులకు దర్శనార్థం టెంట్లు వేస్తున్నారు. మహా శివరాత్రికి ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ సిబ్బందితో పాటు ఆలయ అర్చకులు, సమీప గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. బలరాముడు ప్రతిష్ఠించిన లింగంలో గుంపసోమేశ్వర స్వామి ఆలయం ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. ప్రతి సోమ, శనివారాలు ఒడిశా, ఉత్తరాంధ్ర పలువురు భక్తులు ప్రతిరోజూ దర్శనార్థం ఆలయానికి వస్తుంటారు. శివరాత్రితో పాటు కార్తీకమాసంలో భక్తుల రద్దీ ఈ ఆలయానికి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో శివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని దేవదాయశాఖ ఇఒ ప్రసాద్ తెలిపారు. ఈ ఏర్పాటులో దేవాదాయశాఖ సిబ్బంది శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఉన్నారు.



గుంపస్వామి ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న సిబ్బంది

బాలికల ఆశ్రమ పాఠశాలలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో ప్రహరీ గోడ సమస్య ఉందని పిఒ దృష్టికి తీసుకురాగా దీనిపై స్పందించిన పిఒ ప్రహరీ గోడ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, పాఠశాల హెచ్ఎం వసంత లక్ష్మి, వసతి గృహ అధికారిని పాలక అమల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో ఉన్న గార్డెన్‌ను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఎంఎల్ఎస్ పాయింట్ సబ్ కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌ను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న నిత్యావసర వస్తువుల స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వే, మ్యుటేషన్లకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రీసర్వే పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు.



గోడౌన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ఉపాధ్యాయ పెన్నిధా? కూటమి కుతంత్రమా?



ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. శాసనమండలిలో ఉపాధ్యాయులకు కేటాయించిన ఎమ్మెల్సీ పదవికి కూడా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమింది. ఈనేపథ్యంలో ఉపాధ్యాయుల ఓటు వారి సమస్యలపైనా, హక్కుల సాధనపైనా పోరుబాట పడుతున్న ఉద్యమ గళానికా? కూటమి ప్రభుత్వం పన్నుతున్న కుతంత్రాలకా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

మేధావులకు శాసన మండలిలో కేటాయించిన ఎమ్మెల్సీ పదవిని ఉపయోగించుకుని, ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై గళం వినిపించుకోవాలని ఉపాధ్యాయులు భావిస్తుండగా, ఆ గళానికి కళ్లెం వేసి సమస్యలు వినబడనీయకుండా చేయాలని రాష్ట్రంలో అధికారం చలాయిస్తున్న టిడిపి భావిస్తోంది. కానీ, ఇది అంత ఆషామాషీ కాదు. ఎందుకంటే మాస్టార్లను మోసం చేసి, ఓట్లు దండేయడం అంత సులువు కాదు. ఎంతైనా మేధావులు కదా! ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో మొత్తం 10 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు తరపున మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసునాయుడు మధ్య త్రిముఖపోటీ నెలకొంది. రఘువర్మకు టిడిపి మద్దతు ప్రకటించింది. ఈలెక్కన ఉపాధ్యాయులు - టిడిపి మధ్యే పోటీ ఉన్నట్టుగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు. రాజకీయ పార్టీలకు అందులోనూ అధికార పార్టీలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో భాగమైనవారు ఉపాధ్యాయ సంఘాల నాయకులైనా న్యాయం చేయలేరు. అధికార పార్టీ మద్దతుతో గెలిచిన తరువాత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపడం లేదా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అంత సులువు కాదు. అందుకే శాసన మండలిలో ఉపాధ్యాయుల కోసం రాజ్యాంగం కొన్ని సీట్లను కేటాయించింది. కానీ, ఇందులోనూ అధికార పార్టీ దూరిపోయి రాజకీయం చేయడం మొదలెట్టింది. ఊరకనే రారు మహానుభావులు అన్నట్టుగా... ఊరకనే ఊసిపోక రఘువర్మకు టిడిపి మద్దతు ఇచ్చిందనుకుంటే పొరపాటే. ఉపాధ్యాయులు తమ సమస్యలపై నిర్భయంగా, నికరంగా పోరాడుతున్నారు. ఇటువంటి పోరాటాలకు ఉత్తరాంధ్ర పురిటిగడ్డ వంటిది. పీడిత ప్రజల కోసం తమ ఉద్యోగాలను సైతం వదిలేసి శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం నడిపిన చరిత్ర ఉంది. అటువంటి స్ఫూర్తితోనే ఉపాధ్యాయులు తమ సమస్యలపై పోరాడుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులు పోరాటంతో 117 జీవోను రద్దు చేసినప్పటికీ, క్లస్టర్ స్కూళ్ల పేరుతో ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం విలీనం చేస్తూ అవే విధానాలు అమలు చేస్తోంది. సిపిఎస్ విధానం రద్దుచేసి, ఉద్యోగులకు అనుకూలంగా ప్రత్యామ్నాయ పాలసీ అమలు చేస్తామని చెప్పినప్పటికీ ప్రస్తుతం ప్రభుత్వం నోరు మెదపడం లేదు. పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ బకాయి 24వేల కోట్ల వరకు ఉంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 20శాతం చెల్లిస్తామని చెప్పినప్పటికీ మాట నిలబెట్టుకోలేదు. కొత్త పిఆర్‌సి కమిషన్‌ను వేయలేదు సరికదా ఐఆర్‌సి ప్రకటనే లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ఉపాధ్యాయులు తమ ఆర్థిక అంశాలతో పాటు రేషనలైజేషన్‌లో భాగంగా స్కూళ్ల కుదింపు, ఉపాధ్యాయ పోస్టుల ఎత్తివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈనేపథ్యంలో ఈ సమస్య లన్నీ శాసనమండలిలో చర్చకు వచ్చేందుకు వీలు లేకుండా ఉపాధ్యాయుల గొంతు నొక్కేందుకు తమ కనుసన్నల్లో ఉన్న రఘువర్మకు టిడిపి మద్దతు ప్రకటించింది. మరోవైపు ప్రస్తుతం ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న విజయగౌరి సుమారు 33ఏళ్లగా యుటిఎఫ్ నాయకురాలిగా ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వారి సమస్యలపైనా, విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేపట్టారు. ఎన్నో విజయాలు సాధించారు. ఇందుకోసం ఎన్నో నిర్భందాలు, బెదిరింపులు, అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. ఇటువంటి నేత మండలిలో అడుగుపెడితే సర్కారు ఎదుర్కోవడం అంత సులువు కాదు. ఇప్పటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మండలిలో లేవనెత్తిన ప్రశ్నలకు సర్కారు ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఈనేపథ్యంలో పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న విజయగౌరిని మండలికి రానిస్తే ఇబ్బందులు తప్పవనేది టిడిపి భయం. అందుకే ఆ పార్టీ ఆదేశాల మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లోని స్కూళ్లకు వెళ్లిమరీ ఉపాధ్యాయులను బతిమాలడం, బెదిరించడం వంటివాటికి పాల్పడుతున్నారు. అయినా సరే... ఉపాధ్యాయుల ముందు టిడిపి పాచిక పారే పరిస్థితి కనిపించడం లేదు. అనేక రూపాల్లో తమకు అన్యాయం చేయడమే కాకుండా, తమ హక్కులకే భంగం కలిగిస్తున్న పాలకపార్టీలకు తామెందుకు ఓట్లు వేయాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే టిడిపి మద్దతు ద్వారా మండలికి వెళ్లిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట నిలబెట్టుకోలేదు. దీంతో, నిరుద్యోగులంతా కలిసి చిరంజీవులు డౌన్ డౌన్ అంటూ రాజీనామా చేయాలని పట్టుబడుతూ ఆందోళనలు చేస్తున్నారు. ఉపాధ్యాయులమై ఉండీ మోసం పోతే, ఆ తరువాత ఎవరికి చెప్పుకుంటాం అంటూ గురువుల్లో చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో గెలుపు తీరానికి దగ్గరగా వున్న విజయగౌరి వైపు సానుకూల దృక్పదంతో గురువుల నడక కనిపిస్తోంది.

శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కొమరాడ ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారి జి.సుగుణ కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె శిక్షణ కార్యక్రమంలో టీచర్లు టి.ఎల్.ఎమ్‌లు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ఆకులతో బొమ్మలు వేయడం మొదలగు అంశాలపై టీచర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ ఆర్ లక్ష్మి, డిఆర్పిఎస్ ధనుంజయ నాయుడు, వెంకట నాయుడు సింహాచలం, సిఆర్ఎంటి బి రామకృష్ణ పాల్గొన్నారు.

పుష్పశ్రీవాణిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణిని చినమేరంగిలో గల తన అతిథి గృహంలో కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి వైస్ ఎంపిపి అన్నాజీరావు, జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు షేక్‌నిషార్ తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి చెందిన కురుపాం నియోజకవర్గం మహిళా విభాగం ఆధ్యక్షులుగా ఎంపిపి శెట్టి పద్మావతి, నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం ఆధ్యక్షులు షేక్ ఆదిల్‌ను, ఎస్‌టి సెల్ విభాగం ఆధ్యక్షులు బిడ్డక అన్నాజీరావును, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్‌జిలాని పదవులు వైసిపి అధిష్టానం ఇచ్చినందుకు పుష్ప శ్రీవాణికి, మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజుకు ధన్యవాదాలు తెలుపుతూ వారి సూచనలు సలహాలు పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండలంలో గల ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, సంతోషిని, టివిఎస్ స్వామియోజులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

డిఎస్‌సిలో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

పివి, టిజి తెగ వారు వీరు కోసం 45శాతం మార్కులతో డిఇడిలో శిక్షణ పొందుతారు. అదే మాదిరిగా టెట్‌లో 45శాతం వచ్చే వారికి ఉపాధ్యాయ పోటీ పరీక్షలు రాయడానికి డీఎస్సీలో కూడా అవకాశం కల్పించాలని ఆదివాసీ బహుభాస ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు మర్రి చిట్టిబాబు, సవర ఆనందరావు సవర డొంబు పొంగి కూమారి మూటక భారతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను స్పెషల్ డిఎస్సి ద్వారా భర్తీ చేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

35 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి - పాలకొండ

విజయనగరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పలుచోట్ల దాడులు చేపట్టారు. పాలకొండ-సింగన వలస మధ్యలో ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ సిహెచ్ రాజశ్రీ పెట్రోలింగ్ జరపగా 35 లీటర్ల నాటు సారాతో ఇద్దరు మహిళలను పట్టుకున్నారు. వీరిని పాలకొండ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో హెచ్‌సి జి.సుదర్శన్‌కుమార్, కె.రాంబాబు, బి.రాము ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గం నుంచి వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న జరిగే శాసనసభ సమావేశాల తర్వాత కూడా ప్రజాదర్బార్ కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల టిడిపి అధ్యక్షులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

షెడ్యూల్ ప్రాంతాల్లో జిఒ 3ను రద్దు చేయడంతో గిరిజన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని, కావున ఈ జిఒ పునరుద్ధరణకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిసి శనివారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 19 శాఖల్లో 34 రకాల ఉద్యోగ అవకాశాలు ఆదివాసీలకు హక్కుగా ఉండేదని, జీవో 3 రద్దు కావడంతో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. కావున రాబోవు అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనులను దృష్టిలో పెట్టుకొని ఈ విషయాలను ప్రస్తావించాలని కోరారు. అదేవిధంగా గిరిజన అటవీ ఉత్పత్తులైన జీడి, మామిడి, చింతపండు, చీపుర్లు, తదితర ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతాల్లో చేర్పించాలని, ఆదివాసీలకు స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సవర గంగయ్య ఉన్నారు.

బోధనలో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పిల్లలకు బోధించేటప్పుడు మెలకువలు పాటించాలని ఎంఇఒ-2, కోర్స్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు అర్థమయ్యేలా బోధించి అక్షర జ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా అనేక రకాల చిత్రపటాలు చేశారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు ఎం.పైడిరాజు, ఆర్.ధనుంజయనాయుడు, బి.రాజేష్, అంగన్వాడీ సూపర్వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ, ఎంఆర్‌సి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యగా డుమ్మంగి పంచాయతీలో నీటి సమస్య నివారణకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ పాలక క్రాంతికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కొరటిగూడలో నీటి ఎద్దటి ఉన్న కారణంగా అదనంగా బోరెవెల్ రిగ్గు కొట్టించడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ పరిధిలో ఎక్కడ నీటి సమస్య ఉన్న ప్రజలు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇంజనీర్ అసిస్టెంట్ కపిల్‌దేవ్, వార్డుసభ్యులు సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రూ.2.56 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కస్పా వీధికి చెందిన దూసి సుదర్శన్ వెంకయ్యకు శనివారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఎం.రాజపురం తన క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కు రూ. 2.56 లక్షలు అందజేశారు. ఈయన గత కొంతకాలంగా తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఈ చెక్కును ఎమ్మెల్యే చేతులు మీదుగా అందించింది. నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయభాస్కర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలో ఇంటింటా చెత్త సేకరణ పెద్ద ఎత్తున ప్రారంభమైంది. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండల రావు పార్వతీపురం, కొమరాడ మండలాల్లో శనివారం స్వయంగా పర్యవేక్షణ చేశారు. జిల్లాలో గల 451 గ్రామపంచాయతీలో ఈ కార్యక్రమం సాగుతోంది. శని,ఆదివారాలు అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటింటా చెత్త సేకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుంది. తడి చెత్త, పొడిచెత్త వేరువేరుగా సేకరణ చేస్తున్నారు. సేకరణ చేసిన పొడి చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలు వంటి వివిధ పరికరాలను మరల చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో వేరుచేసి ఆయా రంగాల్లో సేకరణ చేస్తున్న వారికి విక్రయిచడానికి చర్యలు చేపడుతున్నారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేసే ప్రక్రియకు పెద్ద ఎత్తున శ్రీకారం చుడుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్‌ల సేవలను వారితోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది యావత్తు పాల్గొంటున్నారు. ప్రతి వెయ్యి జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రై సైకిల్ ఇప్పటికే సమకూర్చారు. తద్వారా ఈ చెత్త సేకరణ కార్యక్రమం సాగుతోంది. జిల్లా పరిశుభ్రంగా ఉండుటకు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ఆవశ్యకత ఉందని జిల్లా గ్రామపంచాయతీ అధికారి కొండలరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించి పరిశుద్ధ జిల్లాను ఏర్పాటు చేయడంలో తోడ్పాటు అందించాలని కోరారు. పంచాయతీరాజ్ సంచాలకులు ఈ విషయం పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.



గుమ్మలక్ష్మీపురం: ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని అన్ని పంచాయతీలలో ఇఒపిఆర్‌డి కృష్ణారావు ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తని తొలిగించారు. ఇంటిటికీ వెళ్లి గ్రీన్ అంబాసిడర్ ద్వారా తడి, పొడి చెత్త వేరుగా సేకరించారు. కొన్ని పంచాయతీలలో కాలువలో పేరుకుపోయిన చెత్తని తొలిగించారు. ఇంటి పరిసరాలలో చెత్తను పారావేయకూడదని, చెత్త సేకరణ బండిలో వేయాలని సూచించారు.

పారిశుధ్యంపై అవగాహన

సీతంపేట: మండల కేంద్రంలో పారిశుధ్యంపై శనివారం పాలకొండ డిఎల్‌పిఒ రాంప్రసాద్, మండల విస్తరణ అధికారి కొండపల్లి సత్యం, కార్యదర్శి రామకృష్ణ అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు కలెక్షన్ చేయడానికి చెత్తకు సంబంధించిన వాహనం వస్తుందని చెప్పారు. అందులో చెత్త వేస్తే ఆ చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు. పురవీధుల్లో రిక్షాతో మైకు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్విన్ పేటలో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో చెత్త సేకరణ పై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా చేసి ఇంటిముందు ఒక గోనిసంచే పొడి చెత్త కోసం ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేసి పరిశుభ్రం చేసుకోవడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒపిఆర్‌డి ధర్మ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నరేష్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్, కొమరాడ: జిల్లాలో ఇంటింటా చెత్త సేకరణ పెద్ద ఎత్తున ప్రారంభమైంది. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండల రావు పార్వతీపురం, కొమరాడ మండలాల్లో శనివారం స్వయంగా పర్యవేక్షణ చేశారు.



గరుగుబిల్లి : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ కొండలరావు

జిల్లాలో గల 451 గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమం సాగుతోంది. శని, ఆదివారాలు అన్ని గ్రామపంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుంది. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరణ చేయడం జరుగుతుంది. సేకరణ చేసిన పొడి చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలు వంటి వివిధ పరికరాలను మళ్లీ చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో వేరుచేసి ఆయా రంగాల్లో సేకరణ చేస్తున్న వారికి విక్రయించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోంది. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసే ప్రక్రియకు పెద్ద ఎత్తున శ్రీకారం చుడుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్ల సేవలను వారితో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది యావత్తు పాల్గొనడం జరుగుతుంది. ప్రతి వెయ్యి జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రై సైకిల్ ఇప్పటికే సమకూర్చడం జరిగింది. తద్వారా ఈ చెత్త సేకరణ కార్యక్రమం సాగుతోంది. జిల్లా పరిశుభ్రంగా ఉండేందుకు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ఆవశ్యకత ఉందని డిపిఒ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించి పారిశుధ్య జిల్లాను ఏర్పాటు చేయడంలో తోడ్పాటు అందించాలని కోరారు. పంచాయతీరాజ్ సంచాలకులు ఈ విషయం పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మండలంలోని పురోహితనవలస ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ అంజలి దేవి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2025 -26 విద్యాసంవత్సరానికి గాను ఆరవ తరగతి ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి 6వ తరగతిలో ప్రవేశం ఉంటుందనీ, మార్కులు ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లీష్ మీడియంలలో నిర్వహిస్తారన్నారు. ఈ పాఠశాలలో బోధన ఆంగ్లంలోనే ఉంటుందని, 6వ తరగతిలో ప్రవేశానికి ఒసి, బిసి విద్యార్థులకు 35 మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు 30 మార్కులు పొందాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్స్ 9885569242, 9121573367, 7032996552ను సంప్రదించాలని కోరారు.

భామిని: స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో 2025 -26 విద్యా సంవత్సరానికి గానూ ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని, ఇందు కోసం ఆన్లైన్‌లో ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేయడానికి పరీక్షా రుసుం ఒసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 రూపాయలు చెల్లించి www.cse.gov.in/www.apms.ap.gov.in (online) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు పై ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడానికి ఒసి, బిసి విద్యార్థులు 35 మార్కులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 31-3- 2025. పూర్తి వివరాలకు ప్రిన్సిపల్ ఎపి మోడల్ స్కూల్ భామిని, 9440322964, 9542078996,వారిని సంప్రదించగలరు.

నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో వాహనదారులను నిరంతరం పర్యవేక్షిస్తూ, తనిఖీలు చేస్తూ మరో వైపు అవగాహన కల్పిస్తూ నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులను నమోదు చేస్తున్నామని జిల్లా రవాణా శాఖ అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం ప్రజాశక్తి పేపర్లో అదుపుతప్పి ఆటో బోల్తా అన్న శీర్షికతో వెలువడిన వార్తకు ఆయన శనివారం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలోని రవాణా శాఖ ఇంధన, సహాయ ఇంధన శకట తనిఖీ ధారులతో ఎప్పటికప్పుడు అన్ని రకాల వాహన యునియన్స్ (లారీ, ఆటో, మాక్స్ కాబ్, టాక్సీకాబ్ ఇతర రవాణా వాహనాల)తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం, అధిక స్పీడ్‌తో వాహనాలను నడపడం వల్ల కలిగే రహదారి ప్రమాదాలపై వివరిస్తున్నామన్నారు. జిల్లాలో రవాణా శాఖ తనిఖీదారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి గత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించిన 355 వాహనాలపై కేసులు పెట్టి సుమారు రూ. 2.80 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రహదారి భద్రత నియమాలు పాటించని, ఉల్లంగించిన వాహనాల డ్రైవర్స్‌కు సంబంధిన 97 డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశామన్నారు. ఈ సంవత్సరం జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు, 2025 సందర్భంగా జిల్లాలో ప్రత్యేకించి కొమరాడ మండలంలో కూడా సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళున్న వాహనాలపై ప్రతేక దృష్టి పెట్టామన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని జిల్లా సహాయ కార్మిక అధికారి సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్మిక చట్టాల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ దుకాణాల వద్ద పోస్టర్లను పంపిణీ చేసి అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా, ఏ ప్రక్రియలోనైనా 14ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధమన్నారు. బాలల హక్కులను పరిరక్షించడానికి, వారి భవిష్యత్తును కాపాడ్డానికి బాల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం -1986, (సవరణ చట్టం - 2016) చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు లోకి తీసుకొచ్చిందన్నారు. సెక్షన్ 3, సెక్షన్ 3 ఎ ప్రకారం 14 -18 ఏళ్లలో ఉన్న వారి చేత నిర్దేశిత ఎ,బి షెడ్యూలులో పేర్కొన్న నిషేధిత ప్రమాదకరవృత్తులు, ప్రక్రియలో పనిచేయించు కోవడం లేక పనిలోకి అనుమతించిన వారికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సెక్షన్లను ఉల్లంఘించిన వారికి 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని సూచించారు. బాల కార్మికుల గురించి ఫిర్యాదును చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబరు కు తెలియజేయవచ్చని, వివరాలకు సంప్రదించగలరని ఆయన వివరించారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా సహాయ కార్మిక అధికారి వెంటేశ్వరరావు

మూడు నెలలకైనా ముఖం చూపించరా?

ప్రజాశక్తి - మక్కువ

మండల సర్వసభ్య సమావేశం మూడు నెలలకు ఒకసారి జరుగుతున్నప్పటికీ అధికారులు ఎవరూ సరిగా స్పందించకపోవడం తరచూ గైర్హాజరవ్వడంపై జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన పలు శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని స్థానిక ఎంపిడిఒ డిడి స్వరూపరానికి ఆయన సూచించారు. శనివారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల పనుల తీరును సభ్యులకు వివరించారు. ఆర్‌టిసి అధికారులకు పలుమార్లు బస్సులను పునరుద్ధించమని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ శాఖ అధికారులు పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని పశువైద్యాధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఎఇ, ఆర్అండ్‌బి ఎఇలపైన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయమని ఎంపిడిఒకు సూచించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



రుణాల వివరాలను వెల్లడిస్తున్న ఎపిఒ

శిక్షణతో సభ్యులకు ఉపయోగం

ప్రజాశక్తి- సీతంపేట

వార్డు మెంబర్స్‌కు, పీసా ఉపాధ్యక్షులు, ఎస్ఎస్‌జి గ్రూప్ సభ్యులకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పి.త్రినాథ్‌రావు అన్నారు. మండలంలోని 41 షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, పీసా వైస్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, సంబంధిత సచివాలయ సిబ్బందికి పీసా చట్టంపై గత పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. వైటిసి సీతంపేట వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంతాల్లో పంచాయతీల విస్తరణ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ పీసా రూల్స్ 2011 గురించి వివరించారు. పీసా చట్టంలోని ముఖ్యమైన 7 థీమ్స్, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ) 2006, చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై పీసా గ్రామసభ అధికారాలు, పీసా గ్రామసభ బలోపేతం, మాదక ద్రవ్యాల నియంత్రణ, షెడ్యూల్ ప్రాంతాల్లో రుణాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంతాల్లో సాంప్రదాయ పద్ధతుల్లో వివాదాల పరిష్కారం, మాదకద్రవ్యాల వినియోగం, నియంత్రణ, చిన్న తరహా ఖనిజాలు పై పీసా గ్రామసభ అధికారాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి జయంతి రమా ప్రసాద్, ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి సత్యం, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీసా చట్టంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ త్రినాథ్‌రావు

గ్రామాల్లోనే విద్యుత్తు బిల్లులు కట్టించుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లోనే విద్యుత్ బిల్లులను వసూలు చేసుకునేందుకు సిబ్బందిని పంపించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబ మూర్తి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు భారీగా పెరుగుదల, మరోవైపున విద్యుత్ బిల్లు ఎక్కడ, ఎప్పుడు కట్టాలో, సిబ్బంది ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. గతంలో కొమరాడలో విద్యుత్ బిల్లు లు వసూలు చేసుకొనేందుకు నెలకు మూడుసార్లు సిబ్బంది వచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గడిచినా కొన్ని నెలలుగా మండల కేంద్రానికి ఒకే ఒకరోజు అది ఎప్పుడొస్తారో తెలియదని, దీనివల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో పాత పద్ధతిలో మూడు రోజులు, ప్రతి పంచాయతీలు పరిధిలో రెండు రోజుల పాటు కరెంట్ బిల్లు వసూలు చేయించుకొనేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి పనులు పరిశీలన

సీతానగరం: మండలంలోని పెదబోగిలి, చినబోగిలి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు పరిశీలించారు. పెదభోగిలి వెంకట రాజశేఖర చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించి ఉపాధి కూలీల మస్తర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారందరికీ ఉపాధి పని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ద్వారా వేతనదారులు మస్తర్లు వేసి వెరిఫికేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని నియమించుకునే అధికారం ఇవ్వాలనే రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకట రమణతో పాటు యూనియన్ నాయకులు సిహెచ్ సింహాచలం, ఎస్.శంకర్రావు మాట్లాడుతూ ఈనెల 6న రాష్ట్ర మంత్రి వర్గంలో ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు పొరుగు సేవల కార్మికుల నియామకాలను వివిధ ప్రభుత్వ శాఖలకు అధికారం ఇవ్వాలని తీర్మానించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, పిడుగులాంటి ఈ వార్త ఆప్కాస్ ఉద్యోగుల్లో భయాందోళనలను రేకెత్తించింద న్నారు. ఆప్కాస్‌లో నమోదైన వారు సుమారు లక్ష మంది ఉంటే అందులో దాదాపు 45 వేల మంది మున్సిపల్ కార్మికులే ఉన్నారని, గత వైసిపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే 6 నెలల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆప్కాస్‌ను తీసుకువచ్చిందని అన్నారు. అయితే ఆప్కాస్ వల్ల కార్మికులకు ప్రైవేటు ఏజెన్సీల బెడద లేకుండా పోయిందని, ప్రతి నెలా జీతాలలో కోత లేకుండా 1, 2 తేదీల్లో జీతాలు కార్మికుల చేతికి వచ్చాయని పిఎఫ్, ఇఎస్ఐ వాటా నిధులు దుర్విని యోగం కాలేదని ప్రైవేటు ఏజెన్సీల రోజువారీ వేధింపులు, బెదిరింపులు తగ్గాయని, కానీ ఇప్పటి ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలిస్తే కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా పోతుందని, నిత్యం అభద్రతతో పనిచేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల పెత్తనం, దోపిడీతో వేతనాలు సకాలంలో ఉండ వని, పిఎఫ్, ఇఎస్ఐ నిధులు గోల్‌మాల్ అయ్యే ప్రమాదం వుందని కావున, ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు అప్పగించాలనే మంత్రి వర్గ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ చేశారు. అలాగే ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు మామిడి శివ, పి. సంతోష్, బి.రాజేష్, జి. గంగరాజు, గంగే య్యలు, బి.రవి, సుజాత, ఇప్పలమ్మ, పాపులమ్మ, శాంతి, చీరంజీవి మరియు కర్మికులు పాల్గొన్నారు..



కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మికులు, నాయకులు

వైద్య శిబిరంతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో దోహదపడుతుందని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మండల పోలీస్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండలంలోని కునేరులో శనివారం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు, జిల్లా ఆసుపత్రి, ఇండస్ ఆసుపత్రి వైద్య నిపుణులు శిబిరంలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మెగా వైద్యశిబిరాన్ని పరిశీలించిన మాట్లాడుతూ ఎటువంటి ఆరోగ్య సమస్యలకు తనిఖీలు చేపట్టారు, అందజేసిన చికిత్సా వివరాలను అక్కడి వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, వివిధ రకాల పరీక్షలు పరిశీలించారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు రోగులు సేవా కార్యక్రమం చేపట్టారు. అనంతరం జగన్మోహన్‌రావు మాట్లాడుతూ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వారి పరిధిలో ఉన్న మారుమూల గ్రామ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె. నీలకంఠం, వైద్యులు శామ్యూల్, గణేష్, అరుణ్, వైద్య నిపుణులు హరి జగన్, వంశీ కృష్ణ, సౌజన్య, రాహుల్, మేనేజర్ బి. అప్పలనాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ, పోలీస్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు